# తీరని రుణం.. రైతుల రణం



- **షరతుల్లేని రుణమాఫీ చేయాలి..**



ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ బ్యాంకు ముందు రైతులు ధర్నా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా రేవంత్ షరతుల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

**రైతులకు తప్పని క్యూ..**



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట బ్యాంకు వద్దకు వివిధ గ్రామాలకు చెందిన రైతులు భారీగా తరలివచ్చారు. తమ రుణమాఫీ చేయాలని అధికారులను నిలదీశారు.

- **ధన్వాడలో ఏఈఓ నిలదీత**



నారాయణపేట జిల్లా ధన్వాడ రైతు వేదికలో ఏఈఓ సైమన్‌ను రుణమాఫీ చేయాలని రైతులు నిలదీశారు. తమకు అన్ని అర్హతలు ఉన్నా ఎందుకు చేయడం లేదని అక్కడే ఉన్న వ్యవసాయ శాఖాధికారులను నిలదీశారు.




**బ్యాంకు ముందు నిరీక్షణ**

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ బ్యాంకుకు రైతులు తరలివచ్చారు. బ్యాంకు వద్ద అధికారుల కోసం వేచి చూశారు.

**పోలీసుల జులుం**

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై బైఠాయించిన అన్నదాతలను ఈడ్చిపాడేస్తున్న పోలీసులు



- **విధుల అడ్డగింత**




సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లిలో రెండోరోజూ బ్యాంకును మూసివేసి రైతులు నిరసన తెలిపారు. బ్యాంకు సిబ్బంది రైతుల పేర్లు రుణమాఫీకి పంపడంలో నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారుల విధులను అడ్డుకున్నారు.

- **టోకెన్ల కోసం తోపులాట..**



నారాయణపేట జిల్లా ఊట్కూర్ ఎస్‌బీఐ వద్ద టోకెన్ల కోసం తోపులాడుకుంటున్న రైతులు. టోకెన్ల కోసం ఉదయం 9గంటలకే వచ్చి రైతులు బారులుదీరారు. తమకు అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదని, బ్యాంక్ అధికారులను అడిగినా సమాధానం చెప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

- **రహదారిపై బైఠాయించి..**



జగిత్యాల జిల్లా పూడూర్‌లో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు.

# బ్యాంకుల వద్ద రుణ రంగం

రూ.2లక్షల రుణమాఫీ అమలు అస్తవ్యస్తంగా మారింది. సగం మందికి మాఫీ అయ్యి, మరో సగం మందికి కాకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణ మాఫీ కోసం వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకులకు వెళ్తే అధికారులను కలువమని, అధికారులను కలిస్తే బ్యాంకులకు వెళ్లమని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు. బ్యాంకర్ల తప్పిదాల వల్లే కొందరికి మాఫీ కాలేదంటూ మంత్రులు పదేపదే చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బ్యాంకులకు క్యూకట్టారు. తమ రుణమాఫీ ఎందుకు కావట్లేదని సిబ్బందిని నిలదీశారు. పలు చోట్ల ధర్నాలు చేశారు. విధులను అడ్డుకున్నారు. తమకు ఆధార్‌కార్డ్, రేషన్ కార్డు, పట్టా పాస్‌బుక్ ఉన్నప్పటికీ రుణం మాఫీ కాకపోవడమేంటని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ ఏఈవో ఆఫీసులో తొలి, మలి విడుతల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులు చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని చూసి రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

-నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్

**అలా దరఖాస్తులు.. ఇలా చెల్లాచెదురు**



నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో రుణమాఫీ కాని రైతుల నుంచి నోడల్ అధికారి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈఓ కార్యాలయంలో చిందరవందరగా పడేసిన దరఖాస్తులను చూసి రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.




**రుణమాఫీ కోసం దీక్ష**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయగూడెంలో రుణమాఫీ చేయాలని స్వచ్ఛందంగా దీక్ష చేస్తున్న రైతులు

- **బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో..**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం ఏపీజీవీబీ ఎదుట ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

- **దండు కట్టి.. ధర్నా చేపట్టి**



అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.